## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 04-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

### ముఖ్యాంశాలు

- పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాదించిన భారతీయ జనతా పార్టీ అసోం, పుదుచ్చేరిలో మరోసారి అధికారాన్ని దక్కించుకుంది.
- సుపరిపాలన అందిస్తునందుకే ప్రజలు ఎన్డీఏ కూటమిని వరుసగా గెలిపిస్తున్నారని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.
- తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే అతి పెద్ద పార్టీగా అవతరించింది.
- కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో యూడీఫ్ కూటమి విజయం దాదాపు ఖరారయింది.
- ముంబయిలోని వాంఖడే స్టేడియం వేదికగా.. లక్నో సూపర్ జెయింట్స్, ముంబయి ఇండియన్స్ జట్ల మధ్య ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ భారీ విజయం సాధించింది. మొత్తం 293 నియోజక వర్గాలకు గానూ ఇప్పటికే 188 స్థానాల్లో గెలుపొందగా మరో 10 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. ఇక తృణమూల్ కాంగెస్ పార్టీ ఇప్పటివరకూ 70 స్థానాల్లో గెలుపొంది మరో 10 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. 148 స్థానాల మెజార్టీ మార్క్ దాటడంతో ఆ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. కాంగ్రెస్ 2, సీపీఎం 2, ఇతరులు 2 స్థానాల్లో గెలుపొందారు. బిజెపి అభ్యర్థి సువేందు అధికారి నందిగ్రామ్ లో విజయం సాధించారు.

= = = = = = = = = = = = = = = = = = =

సుపరిపాలన అందిస్తునందుకే ప్రజలు ఎన్డీఏ కూటమిని వరుసగా గెలిపిస్తున్నారని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. నాలుగు రాష్ట్రాలతోపాటు ఒక కేంద్రపాలిత ప్రాంతంలో ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ప్రధానమంత్రి న్యూఢిల్లీలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన విజయోత్సవ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్బంగా ప్రసంగిస్తూ... ఈరోజు బీజేపీ చరిత్ర సృష్టించిందని ఇది ప్రజలకు నిజమైన భరోసా ఇచ్చిన రోజని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలో తమ అభ్యర్థులను గెలిపించినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో 93 శాతం పోలింగ్‌తో సరికొత్త రికార్డు సృష్టించారని తమిళనాడు, కేరళలోనూ పోలింగ్ శాతం బాగా పెరిగిందన్నారు. దేశంలో 20కిపైగా రాష్ట్రాల్లో భాజపా, ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు ఉన్నాయని గుర్తు చేశారు. పుదుచ్చేరిలో 2021లో ఇచ్చిన హామీలను తాము నెరవేర్చామని అందుకే విజయం సాధించామన్నారు. బీజేపీ అంటేనే అభివృద్ధి.. సంక్షేమని ప్రజలు నమ్ముతున్నారనినరేంద్రమోదీ మాట్లాడుతూ...

(వాయిస్…29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో చలన చిత్ర నటుడు సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని నూతన పార్టీ తమిళ వెట్రి కజగం టీవీకే అతి పెద్ద పార్టీగా అవతరించింది. మొత్తం 233 స్థానాలకు గానూ టీవీకే పార్టీ 103 స్థానాల్లో గెలుపొందగా మరో 5 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. అధికార పార్టీ DMK 68 స్థానాలతో రెండవ స్థానంలోనూ, ప్రధాన ప్రతిపక్షం AIADMK మూడో  స్థానంలో కొనసాగుతున్నాయి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి MK స్టాలిన్ ఓటమి పాలయ్యారు. కొళత్తూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయన, టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు చేతిలో పరాజయం చెందారు. ఆసాంతం ఉత్కంఠగా సాగిన పోరులో వీఎస్ బాబు 8,795 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఇక మరో వైపు పెరంబూర్ నియోజక వర్గం నుంచి విజయ్ గెలుపొందారు.

= = = = = = = = = = = = = = = = = = =

అసోంలో ఎన్డీఏ కూటమి మరోసారి అధికారాన్ని దక్కించుకుంది. ఈరోజు వెలువడిన ఆ రాష్ట్ర ఎన్నికల ఫలితాల్లో మొత్తం 102 అసెంబ్లీ స్థానాల్లో గెలుపొందింది. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్  21 స్థానాలతో సరిపెట్టుకుంది. ఏఐయూడీఎఫ్ (AIUDF) 2 స్థానాల్లో గెలిచింది. బిజెపి అభ్యర్థి, ముఖ్యమంత్రి హిమంత బిస్వశర్మ తన సమీప ప్రత్యర్థి బిదిషా నియోగ్ పై విజయాన్నిసాధించి, వరుసగా ఆరోసారి జలుక్బారి నియోజకవర్గంలో తన పట్టు నిలుపుకున్నారు. అయితే, అసోం కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ జోర్హాట్ నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి హితేంద్ర నాథ్ గోస్వామి చేతిలో ఓటమి పాలయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఆల్ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ (ఏఐఎన్ఆర్సీ) నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి మరోసారి విజయాన్ని కైవసం చేసుకుంది. మొత్తం 30 అసెంబ్లీ స్థానాలకు గానూ 18 సీట్లలో  గెలుపొంది మెజార్టీని దక్కించుకుంది. దీంతో వరుసగా రెండోసారి అధికార పీఠాన్ని చేజిక్కించుకుంది. ఇక కాంగ్రెస్, డీఎంకే కూటమి 9 సీట్లతో రెండో స్థానానికే పరిమితమయ్యాయి.

= = = = = = = = = = = = = = = = = = =

కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో యూడీఫ్ కూటమి 102 స్థానాల్లో గెలిచి  ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (UDF) తొలి స్థానంలో నిలవగా అధికార CPI(M) నేతృత్వంలోని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (LDF) 31 సీట్లతో  రెండవ స్థానానికి పరిమితమయ్యింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ 3 స్థానాలతో సరిపెట్టుకుంది.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

అత్యంత వేగంగా మారుతున్న నేటి సాంకేతిక విప్లవంలో భవిష్యత్తుకు సిద్ధంగా ఉండాలంటే, పరిశోధనలపై నిరంతరం దృష్టి సారించడం అత్యవసరమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో, భారత సైన్యానికి చెందిన నార్త్, సెంటర్ కమాండ్‌లు, సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరర్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడు రోజుల నార్త్ టెక్ సింపోజియం కార్యక్రమాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్షణ సిబ్బంది, పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలనుద్దేశించి ప్రసంగించారు. రష్యా-ఉక్రెయిన్ సంఘర్షణలో కేవలం మూడు, నాలుగు సంవత్సరాల వ్యవధిలోనే యుద్ధ స్వరూపం ట్యాంకులు, క్షిపణుల నుండి డ్రోన్లు, సెన్సార్ల వరకు మారిపోయిందన్నారు. అంతేకాకుండా, నిత్యజీవితంలో భాగమైన వస్తువులు ప్రాణాంతక ఆయుధాలుగా మారుతున్నాయని.. లెబనాన్, సిరియాలలో జరిగిన పేజర్ దాడులు ఆధునిక యుద్ధ పద్ధతులను పునఃసమీక్షించుకునేలా చేశాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సర్వసిద్ధంగా ఉండాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేస్తూ...

(వాయిస్…31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ఎల్పీజీ పంపిణీ కేంద్రాల వద్ద నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని ఎటువంటి కొరత లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. వాణిజ్య LPG సరఫరా దాదాపు 70 శాతానికి పునరుద్ధరించబడిందని పేర్కొంది. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన అంతర మంత్రిత్వ మీడియా సమావేశంలో పెట్రోలియం సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత

శర్మ మాట్లాడుతూ.. ఏప్రిల్ నెలలో 2.15 లక్షల టన్నులకు పైగా వాణిజ్య LPG విక్రయించబడిందని చెప్పారు. 23 లక్షలకు పైగా 5 కిలోల సిలిండర్లు అమ్ముడయ్యాయని ఆమె వెల్లడిస్తూ...

(వాయిస్…24 సెకన్లు)

అదే విధంగా.. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గల్ఫ్ ప్రాంతపు అదనపు కార్యదర్శి అసీమ్ ఆర్ మహాజన్ మాట్లాడుతూ.. గల్ఫ్ ప్రాంతంలోని భారతీయ సమాజం భద్రతపైనే తమ ప్రయత్నాలు కేంద్రీకృతమై ఉన్నాయని ఆ ప్రయత్నాలను సమన్వయం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. అక్కడి భారతీయ పౌరుల సంక్షేమానికి సంబంధించిన సందేహాలను నివృత్తి చేయడానికి తమ మంత్రిత్వ శాఖలో ఒక ప్రత్యేక కంట్రోల్ రూమ్ పనిచేస్తోందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఐపిఎల్ క్రికెట్ లో భాగంగా ముంబయిలోని వాంఖడే స్టేడియం వేదికగా.. లక్నో సూపర్ జెయింట్స్, ముంబయి ఇండియన్స్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన ముంబయి జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన లక్నో జట్టు 11 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా అగ్ని ప్రమాద నివారణ వారోత్సవాలను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఈరోజు ప్రారంభించింది. కేంద్ర పాలిత ప్రాంతాల భాగస్వామ్యంతో, సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాల సమన్వయంతో ఈ నెల 10వ తేదీ వరకు వారోత్సవాలను నిర్వహిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = =